10-12-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

" మధురమైన పిల్లలారా - అవినాశి జ్ఞానరత్నాల దానమే మహాదానము. ఈ దానము చేయడం ద్వారానే రాజ్యము ప్రాప్తి అవుతుంది, అందువలన మహాదానులుగా అవ్వండి "

ప్రశ్న:- ఏ పిల్లలకు సేవ చేయాలనే ఆసక్తి ఉంటుందో వారి ముఖ్యమైన గుర్తులేవి ?

జవాబు :- 1. వారికి పాత ప్రపంచ వాతావరణము ఏ మాత్రమూ(కొంచెము కూడా) నచ్చదు. 2. వారికి సేవ చేసి చాలామందిని తమ సమానంగా తయారు చేయడంలోనే సంతోషముంటుంది. 3. చదివి, చదివించడంలోనే వారికి విశ్రాంతి లభిస్తుంది. 4. ఇతరులకు అర్థం చేయిస్తూ - అర్థం చేయిస్తూ గొంతు పాడైపోయినా వారు సంతోషంగానే ఉంటారు. 5. వారికి ఇతరుల ఆస్తి అవసరముండదు. ఏ ఆస్తి వెనుకా వారి సమయాన్ని వ్యర్థం చేసుకోరు. 6. అందరి నుండి వారి సంబంధాలు(మోహం) తెగిపోయి ఉంటాయి. 7. వారు తండ్రి సమానము ఉదారచిత్తులుగా ఉంటారు. వారికి సేవ తప్ప ఇంకేదీ మధురంగా(ఇష్టము) అనిపించదు.

పాట :- ఓం నమః శివాయ....

ఓంశాంతి. పాటలో ఏ ఆత్మిక తండ్రి మహిమను విన్నారో, వారే కూర్చొని పిల్లలను చదివిస్తున్నారు. ఇది పాఠశాల కదా. మీరందరు ఇక్కడ టీచరు ద్వారా పాఠము చదువుకుంటున్నారు. వీరు సుప్రీమ్ టీచరు. వీరిని పరమపిత అని కూడా అంటారు. పరమపిత అని ఆత్మిక తండ్రినే అంటారు. లౌకిక తండ్రిని ఎప్పుడూ పరమపిత అని అనరు. ఇప్పుడు మేము పారలౌకిక తండ్రి వద్ద కూర్చొని ఉన్నామని మీరంటారు. కొంతమంది ఇక్కడ కూర్చొని ఉన్నారు. కొంతమంది అతిథులుగా వస్తారు. వారసత్వము తీసుకునేందుకు అనంతమైన తండ్రి వద్ద కూర్చొని ఉన్నామని మీరు భావిస్తారు. కావున మీకు లోపల ఎంత సంతోషం ఉండాలి! పాపం మనుష్యులు ఆక్రందనలు చేస్తూ అరుస్తూనే ఉంటారు. ఈ సమయంలో ప్రపంచములోని వారంతా శాంతి కావాలని అంటున్నారు. శాంతి అనగా ఏమిటో పాపం వారికి తెలియనే తెలియదు. జ్ఞానసాగరులు, శాంతి సాగరులైన తండ్రే శాంతి స్థాపన చేస్తున్నారని మీకు తెలుసు. నిరాకార ప్రపంచంలో ఉండేదే శాంతి. ఇక్కడ ఈ ప్రపంచంలో శాంతి ఎలా ఏర్పడుతుంది? అని ఇక్కడ అరుస్తూ ఉంటారు. నూతన ప్రపంచము అనగా సత్యయుగంలో ఒకే ధర్మమున్నప్పుడు శాంతి ఉండేది. నూతన ప్రపంచాన్ని ప్యారడైజ్, దేవతల ప్రపంచమని అంటారు. శాస్త్రాలలో అక్కడక్కడ అశాంతిని కలిగించే మాటలు వ్రాసేశారు. ద్వాపర యుగములో కంసుని, హిరణ్యకశ్యపుని సత్యయుగంలో చూపిస్తారు. త్రేతాయుగంలో రావణుని గొడవ.... అన్ని చోట్ల అశాంతిని చూపించారు. పాపం మనుష్యులు ఎంతో గాఢాంధకారములో ఉన్నారు. బేహద్ తండ్రిని పిలుస్తూ ఉంటారు. ఎప్పుడైతే గాడ్‌ఫాదర్ వస్తారో అప్పుడు వారే వచ్చి శాంతి స్థాపన చేస్తారు. పాపం వారికి గాడ్ అంటే ఎవరో తెలియనే తెలియదు. శాంతి నూతన ప్రపంచంలో మాత్రమే ఉంటుంది. పాత ప్రపంచంలో ఉండదు. నూతన ప్రపంచాన్ని స్థాపన చేయువారు ఒక్క తండ్రి మాత్రమే. మీరు వచ్చి శాంతి స్థాపన చేయమని వారినే పిలుస్తూ ఉంటారు. ఆర్య సమాజము వారు కూడా శాంతిదేవా అని పాడుతూ ఉంటారు.

తండ్రి అంటున్నారు - మొట్టమొదటిది పవిత్రత. ఇప్పుడు మీరు పవిత్రంగా అవుతున్నారు. అక్కడ పవిత్రతే కాక శాంతి, ఆరోగ్యము, సంపద అన్నీ ఉన్నాయి. ధనము లేకుంటే మనుష్యులు ఉదాసీనంగా ఉంటారు. ఈ లక్ష్మీనారాయణుల వంటి ధనవంతులుగా అయ్యేందుకు మీరు ఇక్కడకు వస్తారు. వీరు విశ్వానికి అధిపతులుగా ఉండేవారు కదా. మీరు విశ్వాధిపతులుగా అయ్యేందుకే ఇక్కడకు వచ్చారు. కాని ఆ బుద్ధి అందరికీ సమానంగా లేదు. నెంబరువారుగా ఉంది. బాబా అంటున్నారు - ఉదయము శాంతియాత్ర చేయునప్పుడు మీ వెంట లక్ష్మీనారాయణుల చిత్రము తప్పకుండా తీసుకెళ్ళండి. ఇటువంటి యుక్తులు రచించండి. ఇప్పుడు పిల్లల బుద్ధి పారసబుద్ధిగా తయారవ్వాలి. ఇప్పుడు తమోప్రధానము నుండి రజో వరకు వెళ్ళారు. ఇంకా సతో, సతోప్రధానము వరకు వెళ్ళాలి. ఆ శక్తి ఇంకా రాలేదు. స్మృతిలో ఉండరు. యోగబలము చాలా తక్కువగా ఉంది. వెంటనే సతోప్రధానంగా అవ్వలేరు. సెకండులో జీవన్ముక్తి అనే గాయనము సరిగ్గానే ఉంది. మీరు బ్రాహ్మణులుగా అయితే జీవన్ముక్తులుగా అయినట్లే. జీవన్ముక్తిలో కూడా సర్వోత్తమ, మధ్యమ, కనిష్ట స్థితులుంటాయి. జీవన్ముక్తి తప్పకుండా లభిస్తుంది. తండ్రికి చెందినవారిగా అయిన తర్వాత తండ్రిని వదిలేసినా, జీవన్ముక్తి తప్పకుండా లభిస్తుంది. అటువంటివారు స్వర్గంలో కసువు ఊడ్చేవారిగా అవుతారు. స్వర్గములోకైతే వెళ్తారు కాని తక్కువ పదవి లభిస్తుంది. తండ్రి అవినాశి జ్ఞానమునిస్తున్నారు. అది ఎప్పుడూ వినాశనమవ్వదు. పిల్లలలో సంతోషపు భజంత్రీలు మ్రోగుతూ ఉండాలి. అయ్యో అయ్యో(హాయ్, హాయ్) అను ఆర్తనాదాల తర్వాత మళ్ళీ వహ్వా-వహ్వా అవుతుంది.

మీరిప్పుడు ఈశ్వరీయ సంతానంగా అయ్యారు. తర్వాత మళ్ళీ దైవీ సంతానంగా అవుతారు. ఈ సమయంలోని మీ జీవితము వజ్ర సమానమైనది. మీరు భారతదేశ సేవ చేసి భారతదేశాన్ని శాంతిగా తయారు చేస్తారు. అక్కడ పవిత్రత, సుఖ-శాంతులు అన్నీ ఉంటాయి. ఇప్పటి మీ జీవితము దేవతల కంటే ఉన్నతమైనది. మీరిప్పుడు రచయిత అయిన తండ్రిని, సృష్టిచక్రాన్ని అర్థం చేసుకున్నారు. ఈ పండుగలు మొదలైనవన్నీ పరంపరగా వస్తూ ఉన్నాయని అంటారు. కాని ఎప్పటి నుండి వస్తున్నాయో ఎవ్వరికీ తెలియదు. సృష్టి మొదలైనప్పటి నుండి రావణుని తగులబెట్టడం మొదలైనవన్నీ పరంపరగా వస్తూ ఉన్నాయని అంటారు. ఇప్పుడు సత్యయుగంలో రావణుడుండడు. అక్కడ ఎవ్వరికీ దు:ఖముండదు. అందువలన గాడ్‌ను(భగవంతుని) కూడా స్మృతి చేయరు. ఇక్కడ అందరూ గాడ్‌ను స్మృతి చేస్తూ ఉంటారు. ఆ దేవుడే వచ్చి విశ్వంలో శాంతి నెలకొల్పుతాడని భావిస్తారు. అందుకే మీరు వచ్చి దయ చూపండి, మమ్ములను దు:ఖము నుండి ముక్తులుగా చేయండి అని పిలుస్తూ ఉంటారు. పిల్లలే తండ్రిని పిలుస్తారు ఎందుకంటే పిల్లలే సుఖాన్ని చూచారు. తండ్రి అంటున్నారు - మిమ్ములను పవిత్రముగా చేసి, నా వెంట తీసుకెళ్తాను. పవిత్రంగా అవ్వని వారు శిక్షలు అనుభవిస్తారు. ఇందులో మనసా, వాచా, కర్మణా పవిత్రంగా ఉండాలి. మనసు కూడా చాలా మంచిగా ఉండాలి. చివరి సమయంలో మనసులో ఎలాంటి వ్యర్థ సంకల్పాలు రానంతగా శ్రమ చేయాలి. ఒక్క తండ్రి తప్ప ఇతరులెవ్వరూ గుర్తు రాకూడదు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - కర్మాతీత అవస్థ వచ్చినంతవరకు వ్యర్థ సంకల్పాలు మనస్సులో వస్తూ ఉంటాయి. హనుమంతుని వలె స్థిరంగా అవ్వండి. అందులోనే చాలా శ్రమ చేయాల్సి ఉంటుంది. ఎవరైతే ఆజ్ఞాకారులు, నమ్మకస్థులు, సుపుత్రులైన పిల్లలుగా ఉంటారో వారి పై తండ్రికి కూడా చాలా ప్రేమ ఉంటుంది. పంచ వికారాల పై విజయము పొందనివారు

అంత ప్రియంగా ఉండరు. మనము కల్ప-కల్పము తండ్రి నుండి ఈ వారసత్వము తీసుకుంటామని పిల్లలైన మీకు తెలుసు. కనుక మనకు సంతోష పాదరస మీటరు ఎంత పైకెక్కాలి! ఇది కూడా మీకు తెలుసు - స్థాపనైతే తప్పకుండా జరుగుతుంది. ఈ పాత ప్రపంచమంతా తప్పకుండా శ్మశానగ్రస్థమవుతుంది. మనము ఫరిస్తాన్‌లోకి(స్వర్గములోకి) వెళ్లేందుకు కల్పక్రితము వలె పురుషార్థము చేస్తూ ఉంటాము. ఇది శ్మశానము కదా. పాత ప్రపంచము, నూతన ప్రపంచాల జ్ఞానము సీఢీ చిత్రంలో ఉంది. ఈ సీఢీ చిత్రము ఎంత బాగున్నా మనుష్యులు అర్థము చేసుకోలేరు. ఇక్కడ సాగర తీరము(ఆబూ)లో ఉండేవారు కూడా పూర్తిగా అర్థం చేసుకోలేరు. మీరు జ్ఞాన ధనాన్ని తప్పకుండా దానము చేయాలి. ధనమిస్తూ ఉంటే ధనము తరగదు. వారిని మహాదాని అని అంటారు కదా. ఎవరైతే ఆసుపత్రులు, ధర్మశాలలు మొదలైన వాటిని కట్టిస్తారో వారిని మహాదానులని అంటారు. దీని ఫలితము వారికి మరుసటి జన్మలో అల్పకాలానికి లభిస్తుంది. ధర్మశాలలు(సత్రాలు) కట్టిస్తే మరుసటి జన్మలో సుఖమునిచ్చే ఇల్లు లభిస్తుంది. కొంతమంది ధనము ఎక్కువగా దానము చేస్తారనుకోండి. వారు రాజుల ఇంటిలో లేక ధనవంతుల ఇంటిలో జన్మిస్తారు. దానము వలన అలా అవుతారు. మీరు చదువు ద్వారా రాజ్య పదవి పొందుతారు, ఇది చదువే కాదు దానము కూడా అయింది. ఇక్కడ ప్రత్యక్షంగా లభిస్తుంది. భక్తిమార్గములో పరోక్షంగా లభిస్తుంది. శివబాబా మిమ్ములను చదివించి ఇలా తయారు చేస్తారు. శివబాబా వద్ద అవినాశి జ్ఞాన రత్నాలున్నాయి. ఒక్కొక్క రత్నము లక్షల రూపాయల విలువ గలది. భక్తిలో ఈ విధంగా అనరు. దీనిని జ్ఞానమని అంటారు. శాస్త్రాలలో భక్తిని గురించిన జ్ఞానముంది. ఎలా భక్తి చేయాలో దానికి శిక్షణ లభిస్తుంది. పిల్లలైన మీకు జ్ఞాన నషా అపారంగా ఉంది. భక్తి తర్వాత మీకు జ్ఞానము లభిస్తుంది. జ్ఞానము వలన విశ్వసామ్రాజ్యాన్ని గురించిన అపారమైన నషా కపాలము వరకు ఎక్కుతుంది. ఎవరైతే ఎక్కువగా చేస్తారో వారికి నషా ఎక్కుతుంది. ప్రదర్శని లేక మ్యూజియంలో కూడా బాగా ఉపన్యసించువారినే పిలుస్తారు కదా. అక్కడ కూడా తప్పకుండా నెంబరువారిగా ఉంటారు. మహారథులు, అశ్వారూఢులు, పదాతిదళము వారు ఉంటారు. దిల్‌వాడా మందిరంలో కూడా స్మారక చిహ్నాలున్నాయి. ఇది చైతన్యమైన దిల్‌వాడా అని, అది జడమని అంటారు. మీరు గుప్తంగా ఉన్నారు. కాబట్టి మిమ్ములను గురించి తెలియదు.

మీరు రాజఋషులు, వారు హఠయోగ ఋషులు. ఇప్పుడు మీరు జ్ఞాన జ్ఞానేశ్వరులు. జ్ఞానసాగరుడు మీకు జ్ఞానమునిస్తారు. మీరు అవినాశి సర్జన్ పిల్లలు. సర్జనే నాడి చూస్తారు. స్వంత నాడే తెలియకుంటే, ఇతరుల నాడి ఎలా తెలుసుకుంటారు. మీరు అవినాశి సర్జన్ పిల్లలు కదా. జ్ఞానాంజనాన్ని సద్గురువిచ్చారు..... ఇది జ్ఞాన ఇంజక్షన్ కదా. ఆత్మకు ఇంజక్షన్ చేస్తారు కదా. ఈ మహిమ కూడా ఇప్పటిదే. ఇదంతా సద్గురువు మహిమే. గురువులకు కూడా జ్ఞాన ఇంజక్షన్ సద్గురువే ఇస్తారు. మీరు అవినాశి సర్జన్ పిల్లలు. కనుక మీ వ్యాపారము - జ్ఞాన ఇంజక్షన్ చేయడం. డాక్టర్లలో కూడా కొంతమంది నెలకు లక్ష రూపాయలు, కొంతమంది 500 కూడా కష్టంగా సంపాదిస్తారు. నెంబరువారుగా ఒకరి తర్వాత ఒకరి వద్దకు వెళ్తారు కదా. హైకోర్టు, సుప్రీం కోర్టులో జడ్జిమెంటు లభిస్తుంది. అక్కడ ఉరిశిక్ష విధిస్తే క్షమించమని ప్రెసిడెంటుకు అప్పీలు చేసుకుంటారు. ప్రెసిడెంటు క్షమించను కూడా క్షమిస్తాడు.

పిల్లలైన మీకు నషా ఉండాలి. ఉదారచిత్తులుగా ఉండాలి. ఈ భగీరథునిలో తండ్రి ప్రవేశించి

ఇతనిని ఉదారచిత్తునిగా చేశారు కదా. వారు ఏదైనా చేయగలరు కదా. వారు ఇతనిలో వచ్చి యజమానిగా అయి కూర్చున్నారు. ఇదంతా భారతదేశ కళ్యాణము కొరకు ఉపయోగించాలని అన్నారు. మీరు కూడా భారతదేశ కళ్యాణము కొరకే ధనాన్ని ఉపయోగిస్తారు. ఎవరైనా మీకు ధనము ఎలా వస్తుందని అడిగితే, మేము మా స్వంత తనువు - మనసు - ధనములతో సేవ చేస్తామని చెప్పండి. రాజ్య పదవి మాకు వస్తుంది కనుక ధనము కూడా మేమే ఖర్చు చేస్తాము. మా స్వంతానిదే మేము ఖర్చు చేస్తాము. బ్రాహ్మణులైన మేము శ్రీమతమునననుసరించి రాజ్యస్థాపన చేస్తాము. ఎవరైతే బ్రాహ్మణులుగా అవుతారో వారు మాత్రమే ఖర్చు చేస్తారు. శూద్రుల నుండి బ్రాహ్మణులుగా అయ్యారు తర్వాత దేవతలుగా అవ్వాలి. బాబా అంటున్నారు - అన్ని చిత్రాలను ట్రాన్స్లైట్‌వి తయారు చేయండి. అప్పుడు మనుష్యులు ఆకర్షింపబడ్తారు. ఎవరికైనా వెంటనే బాణము తగలాలి. కొంతమంది ఇంద్రజాలము చేస్తారనే భయంతో రానే రారు. మనుష్యుల నుండి దేవతలుగా చేయడం ఇంద్రజాలమే కదా. భగవానువాచ - నేను మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను. హఠయోగులు ఎప్పుడూ రాజయోగాన్ని నేర్పించలేరు. ఈ విషయాలను మీరు ఇప్పుడే అర్థము చేసుకుంటున్నారు. మీరు మందిరానికి యోగ్యులుగా అవుతున్నారు. ఈ సమయంలో ఈ విశ్వమంతా అనంతమైన లంకగా ఉంది. పూర్తి విశ్వమంతటి పై రావణుని రాజ్యముంది. సత్య, త్రేతా యుగాలలో ఈ రావణుడు మొదలైనవారు ఎలా ఉండగలరు.

తండ్రి అంటున్నారు - ఇప్పుడు నేనేం వినిపిస్తున్నానో దానిని వినండి. ఈ కనులతో ఏదీ చూడకండి. ఈ పాత ప్రపంచమంతా వినాశనమవ్వనున్నది. అందువలన మనము మన శాంతిధామము, సుఖధామాలనే స్మృతి చేస్తాము. ఇప్పుడు మీరు పూజారుల నుండి పూజ్యులుగా అవుతున్నారు. ఇతను(బ్రహ్మ) నెంబరువన్ పూజారిగా ఉండేవాడు. నారాయణుని చాలా ఎక్కువగా పూజించేవాడు. ఇప్పుడు మళ్ళీ పూజ్య నారాయణునిగా అవుతున్నాడు. మీరు కూడా పురుషార్థము చేసి అలా అవ్వగలరు. రాజధాని అయితే కొనసాగుతుంది కదా. కింగ్ ఎడ్వర్డ్ ది ఫస్ట్, సెకండు, థర్డు..... ఉంటారు కదా. తండ్రి అంటున్నారు - సర్వవ్యాపి అంటూ నన్ను గ్లాని చేస్తూ(తిరస్కరిస్తూ) వచ్చారు, అయినా నేను మీకు ఉపకారమే చేస్తాను. ఈ డ్రామానే అలా అద్భుతంగా తయారై ఉంది. పురుషార్థము తప్పకుండా చేయాలి. కల్పక్రితము కూడా ఎవరు పురుషార్థము చేశారో, డ్రామానుసారము ఇప్పుడు వారే చేస్తారు. ఏ పిల్లలకైతే సేవ చేయాలనే ఆసక్తి ఉంటుందో, వారికి రాత్రింబవళ్ళు అదే చింతన ఉంటుంది. పిల్లలైన మీకు తండ్రి ద్వారా మార్గము లభించింది. కనుక పిల్లలైన మీకు సేవ తప్ప ఇతరమేదీ ఇష్టముండదు. లౌకిక వాతావరణము మీకు నచ్చదు. సేవ చేసేవారికి సేవ లేకుంటే సుఖముండదు. టీచర్లకు చదివించడంలోనే మజా(ఆనందము) ఉంటుంది. ఇప్పుడు మీరు చాలా ఉన్నతమైన టీచరుగా అయ్యారు. మీ వృత్తే ఇది. ఎంత ఎక్కువమందిని మీ సమానంగా చేస్తారో అంత మంచి టీచరు, వారికి అంత బహుమతి(ఫలితము) కూడా లభిస్తుంది. ఇతరులను చదివించకుంటే వారికి సుఖముండదు. ప్రదర్శనీ మొదలైనవాటిలో రాత్రి 12 గంటలైనా ఖుషీగానే ఉంటుంది. అలసట కలిగినా, గొంతు చెడిపోయినా సంతోషంగా ఉంటారు. ఈశ్వరీయ సేవ కదా. ఇది చాలా ఉన్నతమైన సర్వీసు. వారికి ఇతరమేదీ మధురంగా ఉండదు. మేము ఈ ఇల్లు మొదలైనవి తీసుకొని కూడా ఏం చేయాలి? మేము చదివించాలి. ఇదే సేవ చేయాలి. ఆస్తి మొదలైన వాటిలో

తకరార్లు(గొడవలు) వస్తే, చెవులు కోసే బంగారు దేనికి పనికొస్తుంది? అని అంటారు. సర్వీసు ద్వారా అయితే నావ ఆవలి తీరానికి చేరిపోతుంది. బాబా అంటారు - ఇల్లు కూడా వారి పేరు మీదే ఉండనీ, బి.కెలు సేవ చేయాలి. ఈ సర్వీసులో బాహ్యములోని ఏ బంధనాలనూ ఇష్టపడరు, కొంతమందికి మోహముంటుంది. కొంతమంది మోహము తెగిపోయి ఉంటుంది. బాబా అంటున్నారు - మన్మనాభవలో ఉంటే మీ వికర్మలు వినాశనమౌతాయి. సహాయము చాలా లభిస్తుంది. ఈ సేవలో నిమగ్నమైపోవాలి. ఇందులో చాలా ఆదాయముంది. ఇల్లు మొదలైన వాటి విషయం కాదు. ఇల్లు ఇచ్చి బంధనము వేస్తే ఆ ఇల్లు తీసుకోరు. సేవ చేయడం తెలియకుంటే వారు మనకు పనికి రారు. టీచర్లు తమ సమానంగా చేస్తారు. అలా చేయలేకుంటే వారు దేనికి పనికొస్తారు? హ్యాండ్స్(సేవాధారులు) చాలా అవసరముంటుంది కదా. అందులోనూ మాతలు, కన్యల అవసరము చాలా ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు వీరు మన తండ్రి, టీచర్ అని తెలుసు. కనుక పిల్లలు కూడా టీచర్లుగా అవ్వాలని భావిస్తారు. టీచరు ఇతర పని ఏదీ చేయరాదని కాదు. అన్ని పనులు చేయాలి. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. రాత్రింబవళ్లు సేవ చేయాలనే చింత ఉండాలి. మిగిలిన బంధనాలన్నీ తెంచేయాలి. సేవ లేకుంటే సుఖముండదు. సేవ చేసి, మీ సమానంగా తయారు చేయాలి.
2. తండ్రి సమానము ఉదారచిత్తులుగా అవ్వాలి. నాడి చూచి అందరి సేవ చేయాలి. స్వంత తనువు-మనస్సు-ధనాలను భారతదేశ కళ్యాణము కొరకు ఉపయోగించాలి. స్థిరంగా, అచలంగా అయ్యేందుకు ఆజ్ఞాకారులుగా, నిజాయితీపరులుగా అవ్వాలి.

వరదానము :- " "అంతర్ముఖత" అనే గుహలో ఉండే దేహం నుండి భిన్నమైన దేహీ భవ "

ఏవైతే పాండవుల గుహలను చూపిస్తారో - అవి ఈ అంతర్ముఖతా గుహలే. దేహం నుండి ఎంత భిన్నంగా, దేహీ రూపంలో స్థితమయ్యే గుహలో ఉంటారో అంత ప్రపంచ వాతావరణం నుండి అతీతంగా అవుతారు. వాతావరణ ప్రభావంలోకి రారు. ఎలాగైతే గుహ లోపల ఉన్నందువలన బాహ్య వాతావరణం నుండి అతీతంగా అవుతారో అలా ఈ అంతర్ముఖత అనే గుహ కూడా అన్నిటికి భిన్నంగా, తండ్రికి ప్రియంగా చేస్తుంది. ఎవరైతే తండ్రికి ప్రియంగా అవుతారో వారు స్వతహాగా అన్నిటికంటే భిన్నంగా అవుతారు.

స్లోగన్ :- " " సాధన " బీజము, సాధనాలు దాని విస్తారము. విస్తారంలో సాధనను దాచిపెట్టరాదు "